కరీంనగర్ కలెక్టరేట్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశం నుంచి హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని బయటకు లాక్కెళ్తున్న పోలీసులు

రాజీనామా చేసే దమ్ముందా?

మొదటిపేజీ తరువాయి...

జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో జగిత్యాల ఎమ్మెల్యేను కౌశిక్‌రెడ్డి పలు ప్రశ్నలతో నిలదీశారు. 'నువ్వు బీఆర్‌ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన స్వార్థపరుడివి. నీకు ఇక్కడ మాట్లాడే అర్హత లేదు. ఏ పార్టీ నుంచి మాట్లాడుతున్నవో చెప్పాలి? అని ప్రశ్నించారు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఒకరినొకరు నెట్టుకుంటూ దూషించుకున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సీహెచ్ విజయరమణారావు, ఆది శ్రీనివాస్, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మక్కాన్‌సింగ్ ఠాకూర్ తదితరులు కౌశిక్‌రెడ్డిని అడ్డుకున్నారు. ఆయనను వేదికపై నుంచి కిందికి నెట్టే ప్రయత్నం చేశారు. దీంతో వేదికపైనే ఉన్న మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు జోక్యం చేసుకుని కౌశిక్‌రెడ్డిని బలవంతంగా కలెక్టరేట్ ఆడిటోరియం నుంచి లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో కౌశిక్‌రెడ్డి తుళ్లి వేదికపై ఉన్న కుర్చీలో పడిపోయారు. పోలీసులు బలవంతంగా ఎత్తుకెళ్లి ఆడిటోరియం బయట వదిలేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు, కౌశిక్‌రెడ్డికి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఎమ్మెల్యే సంజయ్.. పాడి కౌశిక్‌రెడ్డి ఛాతీపై చేయి వేసి నెట్టేశారు.

ఆ నిబంధన తొలగించాలి: గంగుల

ప్రభుత్వం కొత్తగా అమలుచేస్తున్న నాలుగు పథకాల గురించి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి మంత్రులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఉపాధిహామీ పథకంలో 20 రోజులు పనులు చేసి ఉంటేనే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తిస్తుందనే నిబంధన వల్ల అర్హులకు అన్యాయం జరుగుతుందని, ఆ నిబంధనను తొలగించాలని సూచించారు. పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. తన నియోజకవర్గానికి రూ.10 కోట్లు ఇచ్చారని, కానీ, కాంగ్రెస్ ఇన్‌చార్జి పేరిట జీవో ఇచ్చారని, ఇదేం పాలన? అని ప్రశ్నించారు. తన నియోజకవర్గంలో దళితబంధు పథకాన్ని గత ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా అమలుచేసిందని, వేలాదిమందికి తమ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన డబ్బులు వారి ఖాతాల్లోనే ఉన్నాయని, వాటిని విడిపించుకునే అవకాశం ఇవ్వాలని అడిగితే దళితులపై కేసులు పెట్టి జైల్లో వేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఎమ్మెల్సీ ఎల్ రమణ మాట్లాడుతూ.. జగిత్యాల పరిధిలోని నూకపల్లి అర్బన్ హౌసింగ్ సొసైటీ గురించి ప్రశ్నించారు. కరీంనగర్ మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ.. జిల్లాలో ఎంతమందికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నారో చెప్పాలని కోరారు.

చివరి లబ్ధిదారుని వరకు పథకాలు: ఉత్తమ్

చివరి లబ్ధిదారుని వరకు ప్రభుత్వ ప్రయోజనాలు అందాలని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. వ్యవసాయ యోగ్యమైన భూములకే రైతు భరోసా ఇస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డు అందిస్తామని తెలిపారు. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు చేరవేస్తున్నందుకు అధికారులను అభినందించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను అధికారులు సక్రమంగా అమలుచేయాలని, నిజమైన లబ్ధిదారులకు అందేలా చూడాలని కోరారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

13 నెలల్లో తెలంగాణ నవ్వులపాలు

- కేసీఆర్ హయాంలో పురోగమనం.. రేవంత్ పాలనలో తిరోగమనం
- రాష్ట్రం దివాలా అంటూ డ్రామా
- పగ, ప్రతీకారాలతో కక్ష సాధింపు
- గ్లోబల్ ఎన్నారై అండ్ ఇండియన్ అమెరికన్స్ ఫోరం మీటింగ్‌లో హరీశ్

"రేవంత్‌రెడ్డి పరిపాలన గాలికి వదిలి, ప్రతీకార చర్యలకు దిగారు. ఈ ప్రభుత్వానికి పగ, ప్రతీకారం తప్ప పాజిటివ్ యాటిట్యూడ్ లేదు.
-హరీశ్‌రావు"

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ పాలనలో తెలంగాణ దేశానికే దిక్సూచిగా మారితే.. రేవంత్‌రెడ్డి పాలనలో దేశం ముందు రాష్ట్రం నవ్వులపాలైందని మాజీ మంత్రి హరీశ్‌రావు దుయ్యబట్టారు. 'గ్లోబల్ ఎన్నారై అండ్ ఇండియన్ అమెరికన్స్ ఫోరం' ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఏడాది పాలన, ఫార్ములా- ఈ రేసు అంశాలపై నిర్వహించిన సమావేశంలో జూమ్ మీటింగ్ ద్వారా హరీశ్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక సంక్షేమం, అభివృద్ధి అటకెక్కింది. కేసీఆర్ పాలనలో పురోగమనంలో ఉన్న తెలంగాణ 13 నెలల కాంగ్రెస్ పాలనలో తిరోగమనం పట్టింది. ఆరు గ్యారెంటీల అమలు గురించి మేము అడిగితే రాష్ట్రం దివాలా తీసిందంటూ డ్రామాకు తెరలేపారు. తెలంగాణ అప్పు రూ.4.17 లక్షల కోట్లుగా ఉంటే, రూ.ఏడు లక్షల కోట్లు అనే తప్పుడు ప్రచారం చేశారు. దానిని అసెంబ్లీ సాక్షిగా తిప్పికొట్టాం' అని వివరించారు. తాము సగటున ఏడాదికి రూ.40 వేల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ ఒక్క ఏడాదిలోనే రూ.లక్షా 37 వేల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు.

కేసీఆర్ పాలనలో సుభిక్షం

2014 వరకు ఎంత పండిందో, బీఆర్‌ఎస్ పాలనలో ఎంత పండిందో దాచేస్తే దాగని సత్యమని హరీశ్‌రావు స్పష్టంచేశారు. 2014-15లో 68 లక్షల టన్నుల వరి పండితే, 2023-24 నాటికి కోటి 68 లక్షల టన్నుల వరి ఉత్పత్తి సాధించామని వివరించారు. 2014-15లో కోటీ 31 లక్షల ఎకరాలున్న సాగు విస్తీర్ణం, 2023-24 నాటికి రెండు కోట్ల 22 లక్షల ఎకరాలకు పెరిగిందని చెప్పారు. రికార్డు స్థాయిలో పంట పండిందని గొప్పగా ప్రచారం చేసుకుంటున్న రేవంత్‌రెడ్డికి ఇదంతా ఎలా సాధ్యమైందో తెలియదా? అని ప్రశ్నించారు.

ఫార్ములా- ఈ రేసు తరలివెళ్లడం కాంగ్రెస్ వైఫల్యమే

ప్రభుత్వంపై పోరాటం చేస్తున్నాడనే కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఫార్ములా- ఈ రేసు వచ్చేలా చేసి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకు కేటీఆర్ కృషి చేస్తే.. స్పాన్సర్లను వెళ్లిపోయేలా కాంగ్రెస్ చేసిందని ఆరోపించారు. ఈవెంట్ హైదరాబాద్ నుంచి తరలిపోవడం ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కార్ ఫెయిల్యూరనని స్పష్టంచేశారు. ఫార్ములా-ఈ రేసులో ఎక్కడా ఒక్క రూపాయి కూడా అవినీతి జరగలేదని చెప్పారు.

కేసీఆర్ పాలనలో ప్రగతి పరుగులు

'కేసీఆర్ పాలనలో రాష్ట్ర బడ్జెట్ రూ.62 వేల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్లకు పెరిగింది. జీఎస్డీపీ రూ.5 లక్షల కోట్ల నుంచి రూ.14.5 లక్షల కోట్లకు పెరిగింది. తలసరి ఆదాయం రూ.1.24 లక్షల నుంచి రూ.3.47 లక్షలకు పెరిగింది. సేల్స్‌ట్యాక్స్ రూ.27 వేల కోట్ల నుంచి రూ.73 వేల కోట్లకు చేరింది. ఐటీ ఎగుమతులు రూ.లక్షా పదివేల కోట్ల నుంచి రూ.3.33 లక్షల కోట్లకు చేరాయి. కేసీఆర్ తెలంగాణను దేశానికి రోల్‌మాడల్‌గా నిలిపారు' అని హరీశ్‌రావు వివరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రవాసీలు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ మూలాలతో రేవంత్ పాలన

- మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించిన సర్కార్
- రేవంత్ ఏడాది పాలనలో మత కల్లోలాలు
- సర్కార్‌పై ఎమ్మెల్సీ కవిత ఫైర్

బాన్సువాడలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను గజమాలతో సత్కరిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

ఖలీల్‌వాడి/రుద్రూర్/బాన్సువాడ, జనవరి 12 : సీఎం రేవంత్‌రెడ్డి తనలో ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ మూలాలతో పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఆదివారం ఆమె ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నిజామాబాద్, బాన్సువాడలో మీడియాతో మాట్లాడారు. గాంధీల కుటుంబాన్ని చూసి మైనార్టీలు కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తే ఆ పార్టీ వారిని నట్టేట ముంచిందని విమర్శించారు. గద్దెనెక్కేందుకే అడ్డగోలు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఆ తరువాత వాటి అమలును మరిచిందని మండిపడ్డారు. వెంటనే మైనార్టీ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో మతకల్లోలాల జాడ కనిపించలేదని తెలిపారు. మతకల్లోలాలు జరుగుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. మైనార్టీ యువతులకు స్కూటీలతోపాటు షాదీముబారక్ పథకం కింద తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పటికీ అమలుచేయడంలేదని మండిపడ్డారు. మైనార్టీలకు బడ్జెట్‌లో కనీసం 25 శాతం కూడా కేటాయించలేదని విమర్శించారు. బడ్జెట్‌లో రూ.3 వేల కోట్లు కేటాయించి, కేవలం రూ.700 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతుల కోసం కేసీఆర్ ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్‌ది కోతలే కానీ చేతల ప్రభుత్వం కాదని ఎద్దేవా చేశారు. రైతు భరోసా కింద రూ.15 వేలు ప్రకటించి రూ.12 వేలు ఇస్తామనడంపై మండిపడ్డారు.

పోచారాన్ని ప్రజలు క్షమించరు

రైతుభరోసా సాయం విషయంలో మాట మార్చిన కాంగ్రెస్ పార్టీలో పోచారం శ్రీనివాసరెడ్డి ఎందుకు కొనసాగుతున్నారని కవిత ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైనా పోచారం ఆ పార్టీలో ఎందుకు చేరారో చెప్పాలని నిలదీశారు. పార్టీ ఫిరాయించిన పోచారం శ్రీనివాసరెడ్డిని తెలంగాణ ప్రజలు క్షమించరని అన్నారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో బాన్సువాడ నియోజకవర్గానికి ఏడా దికి రూ.వెయ్యి కోట్ల చొప్పున కేసీఆర్ రూ.పదివేల కోట్లు ఇచ్చారని ఆమె గుర్తుచేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, జాజాల సురేందర్, బీఆర్‌ఎస్ నాయకురాలు ఆయేషా ఫాతిమా, నగర మేయర్ దండు నీతూకిరణ్, జడ్పీ మాజీ చైర్మన్లు విఠల్‌రావు, దఫేదార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో రేవంత్ ఫెయిల్!

మొదటిపేజీ తరువాయి...

దాడులను ప్రోత్సహిస్తున్నట్టుగా ఉందని చెప్పారు. రాగద్వేషాలకు అతీతంగా పాలిస్తానని ప్రమాణం చేసిన రేవంత్‌రెడ్డి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ గూండాలు బరితెగించి దాడులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే రేవంత్‌రెడ్డికి ముఖ్యమయ్యాయని, రాష్ట్రాన్ని రావణకాష్టంగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ ఓపికను బలహీనంగా తీసుకోవద్దని, ప్రశ్నిస్తే దాడులు చేయడం మంచిది కాదని హితవు పలికారు. ప్రజాస్వామ్య సూత్రాలను విస్మరిస్తే పతనం తప్పదని హెచ్చరించారు.

ఎక్కడ పోలీసులు... పెరిగిన నేరాలు?

విపక్ష నేతల అరెస్టుల చుట్టే పోలీసులను తిప్పుతుంతుండడంతో రాష్ట్రంలో క్రైమ్ రేట్ 23 శాతం పెరిగిందని హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దాడుల సంస్కృతి మారకుంటే కేంద్రం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి పాలన విధించయినా శాంతిభద్రతలు కాపాడాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో 9 చోట్ల మత ఘర్షణలు జరిగాయని, కాంగ్రెస్ గుండాలు సిద్దిపేటలోని తన క్యాంప్ కార్యాలయంపైన, ఖమ్మం వరద బాధితుల పరామర్శకు వెళ్లినప్పుడు తన పైన, యాదాద్రి భువనగిరి జిల్లాలో బీఆర్‌ఎస్ కార్యాలయంపై, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడులు చేశారని గుర్తుచేశారు. కౌశిక్‌రెడ్డి ఇంటికి వచ్చిన కాంగ్రెస్ గూండాలకు పోలీసులు ఎస్కార్ట్‌లా వ్యవహరించారని విమర్శించారు. ఇటీవల బీజేపీ కార్యాలయంపైనా దాడులు చేశారని గుర్తుచేశారు. మీడియా సమావేశంలో హరీశ్‌రావుతో మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, సంపత్‌రెడ్డి, మోహన్‌లాల్, భూపేశ్ తదితరులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న పాడి కౌశిక్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ రమణ

సంజయ్‌కి దమ్ముంటే రాజీనామా చేయాలి

కేసీఆర్ పెట్టిన భిక్షతో ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు దమ్ముంటే రాజీనామా చేసి, కాంగ్రెస్ బీఫాంపై పోటీ చేసి గెలవాలని పాడి కౌశిక్‌రెడ్డి సవాలు చేశారు. తనపై కాంగ్రెస్ ప్రభుత్వం దౌర్జన్యం చేస్తున్నదని మండిపడ్డారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లో తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేనైన తనను మంత్రుల సాక్షిగా కరీంనగర్ సమీక్షా సమావేశం నుంచి బయటకు లాక్కొచ్చారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నుంచి గెలిచి, అమ్ముడుపోయిన జగిత్యాల ఎమ్మెల్యేను 'నీది ఏ పార్టీ?'అని అడిగితే.. 'కాంగ్రెస్ పార్టీ' అని చెప్పున్నాడని, అతనిపై స్పీకర్ అనర్హత వేటు వేయాలని కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను విమర్శిస్తుంటే తాము చూస్తూ ఊరుకోలేమని స్పష్టంచేశారు. ఇలాంటి వారిని నిలదీస్తామని, అడుగడుగునా అడ్డుకుంటామని చెప్పారు. మూడేండ్ల తర్వాత మళ్లీ కేసీఆర్ సీఎం అవుతారని, ఇప్పుడు అతిగా ప్రవర్తిస్తున్న ప్రతి ఒక్కరిపై చర్యలు తప్పవని స్పష్టంచేశారు. బీఆర్‌ఎస్ నుంచి గెలిచి పార్టీ మారిన ఎవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. సంజయ్ రాజీనామా చేసే వరకు ఇదే పరిస్థితి ఉంటుందని స్పష్టంచేశారు. ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ.. కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే మంత్రి, కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పకుండా దాడులు చేశారని ఆరోపించారు. రైతుల గురించి అడిగితే సమాధానం చెప్పకుండా తప్పించుకున్నారని విమర్శించారు.

బ్రాహ్మణ పరిషత్‌కు మొండిచెయ్యి!

- బడ్జెట్‌లో కేటాయింపులు.. విడుదలకాని నిధులు
- ప్లానింగ్ విభాగం సిఫారసు చేసినా ఫలితం శూన్యం
- పథకాల అమలుకు ఆటంకం.. 50 కోట్లు అత్యవసరం
- వచ్చే ఏడాది బడ్జెట్‌లో రూ.350 కోట్లకు ప్రతిపాదనలు

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు ప్రస్తుత 2024-25 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించినప్పటికీ ఇంతవరకు ఒక్క పైసా విడుదల చేయలేదు. దీంతో సంక్షేమ పథకాలన్నీ నిలిచిపోయాయి. అంతేకాదు, గతంలో వివిధ పథకాలకు ఎంపికైన లబ్ధిదారులకు చేయాల్సిన చెల్లింపులు కూడా పెండింగ్‌లో పడ్డాయి. కాగా, వచ్చే 2025-26 ఆర్థిక సంవత్సరం కోసం బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ రూ.350 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.

మూడు త్రైమాసికాలు గడిచినా

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పాటైనప్పటి నుంచి బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు ఒక్క పైసా కూడా విదిల్చకపోవడంతో పథకాల అమలుకు ఆటంకం ఏర్పడింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వివేకానంద విదేశీ విద్య, బెస్ట్ వంటి పథకాలకు ఎంపికైన అభ్యర్థులకు దాదాపు రూ.50 కోట్లకుపైగా చెల్లింపులు చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అవన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. చాలా మంది అభ్యర్థులు వివిధ విదేశీ యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందినప్పటికీ నిధులు విడుదల కాకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలోనే 2024-25 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించింది. కానీ, మూడు త్రైమాసికాలు ముగిసినా ఇంతవరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో గతంలో పెండింగ్‌లో ఉన్న చెల్లింపులు జరగకపోగా, ప్రస్తుత ఏడాది కోసం వచ్చిన దరఖాస్తులు సైతం అటకెక్కాయి. ప్రభుత్వం పాలకమండలిని ఏర్పాటు చేయకపోవడం, నిధులు విడుదల చేయకపోవడంతో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధికారులు కొత్తగా దరఖాస్తులు ఆహ్వానించకపోగా, ఉన్న దరఖాస్తులను కూడా పక్కనపెట్టారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ కేవీ రమణాచారి విజ్ఞప్తి మేరకు గత డిసెంబర్‌లో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు సంబంధించి వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఇవ్వాల్సిన నిధులను చెల్లించేందుకు గాను రూ.40 కోట్లు విడుదల చేయాలని ప్లానింగ్ శాఖ.. ఆర్థిక శాఖకు లేఖ రాసింది. అయినా ఫలితం దక్కలేదు.

రూ.50 కోట్లు ఇస్తేనే చెల్లింపులు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన రూ.50 కోట్లు విడుదల చేస్తే పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు చెల్లింపులు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది కొత్త దరఖాస్తులు ఆహ్వానించకపోగా, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా ముట్టుకోకపోవడంతో ప్రస్తుతానికి రూ.50 కోట్లు సరిపోతాయని వారు పేర్కొంటున్నారు. ఒకవేళ ప్రభుత్వం ఆయా సంక్షేమ పథకాలను కొనసాగించాలని భావిస్తే అందుకు తగినట్టుగా నిధులు విడుదల చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే తప్ప కొత్త దరఖాస్తుల ప్రక్రియ చేపట్టే వీలులేదని వారు వివరించారు. ఇటీవల దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్‌ను బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వైస్ చైర్మన్‌గా నియమించడంతోపాటు ఆమెకు చెక్ పవర్‌ను కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. బ్రాహ్మణ సంఘాలు ఇప్పటికే మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు ముఖ్య కార్యదర్శికి కూడా పలుమార్లు విజ్ఞప్తి చేశాయి. అయినా ఫలితం లేకుండా పోయింది.

బీఆర్‌ఎస్ హయాంలో ఏటా రూ.100 కోట్లు

రానున్న ఆర్థిక సంవత్సరం 2025-26 బడ్జెట్‌లో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు రూ.350 కోట్లు కేటాయించాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. విదేశీ విద్య, బెస్ట్ తదితర పథకాల అమలుతోపాటు గోపన్‌పల్లి, సూర్యాపేట బ్రాహ్మణ సదన్‌ల పనులను పూర్తి చేసేందుకు ఈ మేరకు నిధులు అవసరమని వారు పేర్కొన్నారు. గతంలో బీఆర్‌ఎస్ సర్కార్ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు ఏటా రూ.100 కోట్లకు తగ్గకుండా నిధులు కేటాయించేది. దీంతో సంక్షేమ పథకాలను అమలు చేయడంతోపాటు పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ, బ్రాహ్మణ సదన్‌ల నిర్మాణం వంటి పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో సంక్షేమ పథకాలను, నిర్మాణ పనులను పూర్తిచేసేందుకు రూ.350 కోట్లు అవసరమవుతాయని అధికారులు చెబుతున్నారు.

ఎంతకాలం నిర్బంధం

- హరీశ్‌రావు

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ నేతలపై దుర్మార్గమైన నిర్బంధం ఎంతకాలం అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాతోపాటు హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలను ఎక్కడిక్కడ అరెస్టులు, గృహ నిర్బంధం చేయడాన్ని ఆయన తీవ్రం గా ఖండించారు. బీఆర్‌ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల దాడులను నిరసిస్తూ జిల్లా కేంద్రంలో చేపట్టిన ధర్నా కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు అక్రమ అరెస్టులకు పాల్పడటం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. పోలీసు బలం ఉపయోగించి, ప్రతిపక్షాలను అణిచివేయాలని చూడటం అప్రజాస్వామికమని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఆగడాలను, అణచివేతను ధైర్యంగా ఎదుర్కొంటామని, ఎన్ని నిర్బంధాలు, అరెస్టులు చేసినా ప్రజల పక్షాన నిలబడి కొట్లాడే వైఖరి మారదని హెచ్చరించారు.

మద్యం ధరల పెంపులో ఎమ్మెల్యే హస్తం!

మొదటిపేజీ తరువాయి...

కంపెనీల డిమాండ్లు, ధరల పెంపు, సరఫరా మీద ప్రభుత్వ విధి విధానాలు చర్చించటం వివాదాస్పదమవుతున్నది. ఈ సమావేశానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావటంతో సోమవారం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే కంపెనీల్లో షేర్ల విలువ మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. అయితే ఆయనను ఏ హోదాలో సీఎం సమీక్షా సమావేశానికి ఆహ్వానించారో సీఎంవో ఇప్పటివరకు వెల్లడించలేదు.

క్వార్టర్ బాటిల్‌పై రూ.10 తగ్గించిన అప్పటి సీఎం కేసీఆర్..

డిస్టిలరీలు, బ్రూవరీల డిమాండ్లకు తలొగ్గేది లేదని రాష్ట్ర ప్రభుత్వం పైకి డాంభికాలు పలుకుతున్నప్పటికీ అంతర్గతంగా మాత్రం మద్యం ధరల పెంపునకే మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. మద్యం ధరలు పెంచకపోతే రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు నడపలేమనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్టు తెలుస్తున్నది. ధరలు నిర్ణయించటంలో రింగ్‌లీడర్‌గా వ్యవహరిస్తున్న మద్యం వ్యాపారి సూచనలు, సలహాలకు అనుగుణంగానే నడుచుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు మౌఖిక ఆదేశాలు అందినట్టు ఎక్సైజ్ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2023లో క్వార్టర్ బాటిల్ మద్యంపై రూ.10 చొప్పున తగ్గించడం వల్ల రూ.800 కోట్ల లోటు వచ్చినట్టు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అంచనా వేస్తున్నది. ఈ ఈ నేపథ్యంలో కేసీఆర్ తగ్గించిన రూ.10తోపాటు మరో రూ.10 కలిపి మొత్తం రూ.20 వరకు ధరలు పెంచే వెసులుబాటు ఉందని, దీని ద్వారా రూ.1600 కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుందని ఎక్సైజ్ అధికారులు ఇటీవల ప్రతిపాదన చేసినట్టు తెలిసింది. బీరు బాటిల్ మీద కూడా మరో రూ.10 వరకూ ధర పెంచడం ద్వారా మరో రూ.300 కోట్ల ఆదాయం సమకూరుతుందని, మొత్తంగా అన్నీ కలిపి రూ.2000 కోట్ల నుంచి రూ.2,500 కోట్ల వరకు అదనపు ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు సీఎంకు నివేదిక సమర్పించినట్టు తెలిసింది. పొరుగు రాష్ట్రాల్లో లిక్కర్ ధరలు పరిశీలించి, అందుకు అనుగుణంగా తెలంగాణలో నిర్ణయించాలని సీఎం సూచించినట్టు సమాచారం. పొరుగు రాష్ట్రంలో ఇటీవల మద్యం ధరలను స్వల్పంగా తగ్గించారు. అయినప్పటికీ తెలంగాణ కంటే కనీసం 20 నుంచి 25 శాతం వరకు ఎక్కువగా ఉన్నాయి. తాజాగా అవే ధరలను తెలంగాణలో అమల్లోకి తేవడానికి ఎక్సైజ్ శాఖ కసరత్తు చేస్తున్నట్టు సమాచారం

మాజీ ఎంపీ మందా జగన్నాథం కన్నుమూత

మొదటిపేజీ తరువాయి...

చంపాపేట్‌కు తరలించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సంతోష్‌నగర్ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మందా జగన్నాథం మృతిపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో వారి కృషి, పార్టీకి వారు అందించిన సేవలను కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఒక సీనియర్ రాజకీయవేత్తను కోల్పోయిందని కేసీఆర్ విచారం వ్యక్తం చేశారు. శోకతప్తులైన వారి కుటుంబసభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైద్యవృత్తి నుంచి రాజకీయాల్లోకి..

జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం, ప్రస్తుత ఎర్రవల్లి మండలం కొండేరు గ్రామంలో పెద్దపుల్లయ్య- మంద సవారమ్మ దంపతులకు 1951 మే 22వ తేదీన మందా జగన్నాథం జన్మించారు. ఆయన తండ్రి నాగార్జునసాగర్‌లోని పైలాన్ కాలనీలో మెకానికల్ విభాగంలో వాచ్‌మెన్‌గా, తల్లి సవారమ్మ హిల్‌కాలనీలో ఆఫీస్ అటెండెంట్‌గా పని చేశారు. విద్యాభ్యాసం అనంతరం వైద్య వృత్తిలో కొనసాగారు. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ నుంచి పోటీచేసి నాగర్‌కర్నూలు ఎంపీగా విజయం సాధించారు. పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కూడా కొనసాగారు. తర్వాత కొంతకాలానికి కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1996, 1999, 2004, 2009 ఎన్నికల్లో టీడీపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి ఎంపీగా పోటీచేసి విజయం సాధించారు. 2014 మలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ అడుగు జాడల్లో నడిచారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో ఎంపీ పదవిని త్యాగం చేశారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత ఆయన కుమారుడికి అలంపూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా, మందా జగన్నాథం నాగర్‌కర్నూల్ ఎంపీగా బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బరిలో దిగగా, విజయం వరించలేదు. అయినా కేసీఆర్ వెంటే ఉన్నారు. ఆయన సేవలను గుర్తించిన కేసీఆర్ ఢిల్లీలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రత్యేక ప్రతినిధిగా క్యాబినెట్ హోదాలో రెండుసార్లు అవకాశం కల్పించారు. మందా జగన్నాథంకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మంద జగన్నాథం మృతితో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం, అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గం మొత్తం శోకసంద్రంలో మునిగిపోయింది.

మందా జగన్నాథం (ఫైల్)

మందా జగన్నాథం మృతి బాధాకరం

మాజీ ఎంపీ మందా జగన్నాథం మృతిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం ప్రకటించారు. నాగర్‌కర్నూల్ ప్రజలకు సుదీర్ఘకాలం పార్లమెంటు సభ్యుడిగా సేవలందించిన మంద జగన్నాథం మృతి బాధాకరమన్నారు. వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తనదైన ముద్ర వేసిన జగన్నాథం

మందా జగన్నాథం మృతి బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి హరీశ్‌రావు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాజకీయాల్లో వారిది ప్రత్యేక ముద్ర అని పేర్కొన్నారు. మందా జగన్నాథం మృతిపై శాసనసమండలిలో ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు ఆంజనేయులు, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎర్రోళ్ల తదితరులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

సీఎం, స్పీకర్ సంతాపం

సీఎం రేవంత్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు, ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.